క్లుప్తంగా

మంత్రి సీతక్కను కలిసిన ఎంపీ



సురేష్‌షెట్కార్‌ను సన్మానిస్తున్న సీతక్క

నారాయణఖేడ్: పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను మంగళవారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ షెట్కార్‌ను సీతక్క శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

న్యూఇయర్ శుభాకాంక్షలు

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి రూరల్: సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు మంగళవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళానన్నారు. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

న్యూట్రి గార్డెన్ పెంచాలి

అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్



సంగారెడ్డి జోన్: జిల్లాలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రి గార్డెన్ పెంచాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసంపూర్తిగా ఉన్న భవనాలు, టాయిలెట్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. పోషణ లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి వారికి బాలామృతం పంపిణీ చేయాలని తెలిపారు. అతి తీవ్రత పోషణ లోపం ఉన్నవారిని గుర్తించి ఎన్ఆర్‌సీకి పంపించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి బంగారు పతకం



సాయితేజ

సంగారెడ్డి జోన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీఎం కప్‌లో భాగంగా వరంగల్‌లో నిర్వహించిన అండర్ -16 బాలుర లాంగ్ జంప్ విభాగంలో సంగారెడ్డికి చెందిన కొన్యాల సాయితేజ బంగారు పతకాన్ని సాధించాడు. పతకాన్ని గెలిచినందుకు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, 6 వార్డు కౌన్సిలర్ మహమ్మద్ సోహెల్ అలీ, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ, టీఎన్జీఓఎస్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ జావేద్ అలీ విద్యార్థిని అభినందించారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న ఆర్ఐ

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం ఖాజిపల్లి గ్రామంలో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదులపై రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఆర్ఐ జయప్రకాష్ నారాయణ గ్రామంలోని సర్వేనంబర్ 181లో అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. అక్రమంగా ప్రభుత్వ స్థలాల్లో చేపడుతున్న ఐదు బేస్‌మెట్ల నిర్మాణాలను జేసీబీతో కూల్చివేతలు చేయించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ హోంగార్డు మృతి

సంగారెడ్డి క్రైమ్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన హోంగార్డు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టౌన్ సీఐ రమేష్ కథనం ప్రకారం.. బల్లెపు మచ్చేందర్ (41), తండ్రి స్థానికంగా సంగారెడ్డి పట్టణంలోని రాంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 23న సా. 7.30 నిమిషాలకు ఎస్పీ ఆఫీస్ ఎదురుగా నడుచుకుంటూ వెళ్తున్న మచ్చేందర్‌ను ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చెరువులోకి మురుగు నీరు !



వనం చెరువులో చేరిన మురుగునీరు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని శివారు ప్రాంతాల కాలనీలకు చెందిన మురుగునీరు వనం చెరువు, మేళ్ల చెరువుల్లోకి చేరుతోంది. స్థానిక ప్రజలు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గతంలో స్థానిక ప్రజాప్రతినిధులు నిరాహార దీక్షలు సైతం చేశారు. అయినప్పటికీ సమస్యను పరిష్కారం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. చెరువులోకి మురుగు నీరు ఎక్కడి నుంచి వస్తుందో అధికారులకు తెలిసినా ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో మున్సిపల్ అధికారులు చెరువులోకి మురుగు నీరు వచ్చే కాల్వల వద్ద చిన్నపాటి మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌లను ఏర్పాటు చేసి చెరువులను పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటికీ వరకు అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం రెండు చెరువులు మురుగునీటితో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఇలాగే కొనసాగితే తెల్లాపూర్‌లో చెరువులు కనుమరుగయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి చెరువులను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

యాసంగి పంటల పరిశీలన



జొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్ టౌన్: మండలంలోని రైతులు సాగు చేస్తున్న యాసంగి పంటను మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. ఏడీఏ భిక్షపతి తదితరులు రైతులు సాగు చేస్తున్న సాయి జొన్న, కుసుమ, శనగ, అవిశ, అవాలు తదితర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారింజ వాగు పరివాహక ప్రాంతం రైతులు ఐదారు పంటలు సాగు చేస్తుంటారని చెప్పారు. ఇక్కడి రైతులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఒక పంట దెబ్బతింటే మరో పంటలో లాభం వస్తుందన్నారు. సాయిజొన్న పంటకు కత్తెర పురుగులు ఆశించగా నివారణ చర్యలు సూచనలు చేశారు. వాము పంటకు బూడిద తెగులు ఆశించగా కొణజోల్ మందును పిచికారీ చేయాలని చెప్పారు. ఆయన వెంట ఏఓ.హస్నొద్దీన్, ఏఈఓ ప్రదీప్‌కుమార్, ఏటీఎం, అహ్మద్ పాష, రైతులు కిష్టప్ప, కృష్ణ, సిద్దిరాం, స్వామిదాస్, సంగారెడ్డి, నర్సింహ్మారెడ్డి ఉన్నారు.

అల్ఫాబెట్, నంబర్లతో బొమ్మలు



బోర్డుపై గీసిన బొమ్మ

మునిపల్లి(అందోల్): అల్ఫాబిట్, నంబర్లతో బొమ్మలు ఎలా గీయాలో పెద్దగోపులారం ప్రైమరీ పాఠశాల టీచర్ అనురాధ విద్యార్థులకు గీసి చూపించారు. మంగళవారం పాఠశాల బోర్డుపై అల్ఫాబిట్, నంబర్‌తో బొమ్మలు సులువుగా ఎలా గీయాలో నేర్పించారు.

ఎల్ఓసీ అందజేత

నారాయణఖేడ్: మనూరు మండలం బోరంచకు చెందిన పీరయ్య అనారోగ్యానికి గురై ఆస్పత్రి పొందుతున్నాడు. సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా అత్యవసర ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షలు మంజూరయ్యాయి. సంబంధించిన ఎల్ఎసీ పత్రాన్ని మంగళవారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ బాధితుడి కుటుంబానికి అందజేశారు. మండల మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రవీందర్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాజునాయక్ పాల్గొన్నారు.

67 వాహనాల స్వాధీనం

నారాయణఖేడ్: పట్టణంలోని బసవేశ్వరచౌక్ నుంచి శివాజీచౌక్ ఇరుపక్కల కాలనీల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధి సీఐలు, ఎస్సైలు, సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 67ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

వేగంగా సర్వేను పూర్తి చేయండి



సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్‌బాబు



సర్వేను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులను ఎంపీడీఓ రమేష్‌బాబు మంగళవారం పరిశీలించారు. కల్హేర్, మార్డి, ఇందిరానగర్, మునిగేపల్లి, ఫత్తేపూర్, అలీఖాన్‌పల్లి, మొదళ్లకుంట తండా, బల్కంచెల్క తండాలో ఇందిరమ్మ ఇళ్ల వివరాలు నమోదు గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు కృష్ణాచారి, పవన్, బీరప్ప, సిబ్బంది నగేష్, షాకీర్, పరమేష్ పాల్గొన్నారు.

మొగుడంపల్లిలో ..

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రం మొగుడంపల్లిలో స్పెషల్ అధికారి గోపాల్ సింగ్ ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటించి సర్వే గురించి తెలుసుకున్నారు. సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్టీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్ గదులు, వంట గది, కూరగాయలు, నిత్యావసర సరుకులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ హసీనా బేగం, పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ డేవిడ్, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, హాస్టల్ ప్రిన్సిపాల్ హిమబిందులు ఉన్నారు.

రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తాం



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, గ్రామస్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రేజింతల్ గ్రామ సమీపంలో వివాదాస్పదంగా మారిన హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని మంగళవారం అధికారులు పరిశీలించారు. ఎవరు ఎలాంటి ఆందోళనలు చేయొద్దని రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని 1/1/ఆ సర్వే నంబర్‌లో 8.39 ఎకరాలు ఉంది. అందులో 2.32 ఎకరాలు శహదాబీ పేరున, 2.30 ఎకరాలు ఇబ్రహీం పేరున పట్టా భూమి ఉంది. అదే సర్వే నంబర్ స్థలాన్ని దశాబ్దాల నుంచి హిందువులు శ్మశాన వాటికగా ఉపయోగించుకుంటున్నారు. శ్మశాన వాటిక స్థలం తమదేనంటూ సోమవారం ఓ వ్యక్తికొంత భాగాన్ని దున్ని వేశాడు. దీంతో కొన్ని సమాధులు నేల మట్టమయ్యాయి. గమనించిన కొందరు ఆందోళనకు దిగారు. ఈ విషయమై గ్రామస్తులు రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌రావు, హద్నూర్ ఎస్ఐ రాజశేఖర్ శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు. రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని, అప్పటి వరకు అందరు శాంతియుతంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఘనంగా సిద్ధివినాయక జయంత్యుత్సవాలు



స్వామివారికి పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రేజింతల్ గ్రామ శివారులో స్వయంభూగా వెలసిన సిద్ధివినాయక ఆలయంలో మంగళవారం 225వ జయంతోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. వేకువజాము నుంచే ఆలయంలో పూజ కార్యక్రమాలు మొదలయ్యాయి. ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో మొదటి రోజు మంగళవారం స్వామి వారికి వేదఘోషం, దీప ప్రజ్వల, ధ్వజారోహణ, స్వస్తిపుణ్యాహవాచకం, అభిషేకం, దేవతా ఆహ్వానం, మహా మంగళ హారతీ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు ఆలయ పరిసర ప్రాంతాలు, జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దైవదర్శనం చేసుకున్నారు.

మరో చరిత్రాత్మక వేతన ఒప్పందం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కరాములు

పటాన్‌చెరు టౌన్: సీఐటీయూ ఆధ్వర్యంలో మరో చరిత్రాత్మక వేతన ఒప్పందం జరిగిందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. పటాన్‌చెరు ప్రాంతంలోని శాండ్విక్ పరిశ్రమలో శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో 14వ చారిత్రాత్మక వేతన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం పరిశ్రమ ఆవరణలో అభినందన సభను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, శాండ్విక్ యూనియన్ అధ్యక్షుడు చుక్క రాములు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వేతన ఒప్పందం సందర్భంగా అనేక ఛాలెంజెస్ ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ తన రికార్డును తానే అధిగమించే వేతన ఒప్పందం సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాండురంగారెడ్డి, యూనియన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు,కార్మికులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ల అభివృద్ధికి కృషి చేస్తా

రాష్ట్ర గవర్నెన్స్ వింగ్ జాయింట్ సెక్రటరీ నాగరాజ్

సదాశివపేట(సంగారెడ్డి): సమాజంలో వెనుకబడిన కులాల్లో ఎక్కువ భాగం క్రిస్టియన్లు ఉన్నారని వారి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జాతీయ క్రిస్టియన్ కమ్యూనిటీ తెలంగాణ రాష్ట్ర గవర్నెన్స్ వింగ్ జాయింట్ సెక్రటరీ సుక్కల్ల నాగరాజ్ పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డిలో జరిగిన సమావేశంలో జాతీయ క్రిస్టియన్ కమ్యూనిటీ తెలంగాణ రాష్ట్ర గవర్నెన్స్ వింగ్ జాయింట్ సెక్రటరీగా సుక్కల్ల నాగరాజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అందరి సహాయ సహకారాలతో సమస్యల పరిష్కారానికి నిస్వార్థంగా సేవా చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

సొంతింటి కల సాకారమే లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నిరుపేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం కోసం స్థల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొదటి విడతలో సొంత స్థలం కలిగి ఉండి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణానికి నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితులను దళారులను ఆశ్రయించవద్దని, పూర్తి పారదర్శకతతో లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో మాడల్ హౌస్ నిర్మాణం పనులు త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



కాలనీలో పర్యటించిన కార్పొరేటర్, అధికారులు

పటాన్‌చెరు టౌన్: ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో జీహెచ్ఎంసీ నుంచి నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ డీఈ దేవేందర్, ఏఈ శివకుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అధికారులు నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ప్రజాధనం వృథా కాకుండా చూడాలన్నారు. డ్రైనేజీ మ్యాన్ హోల్స్ ఉన్న చోట సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల కొత్త రోడ్లను మళ్లీ తవ్వి మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి వస్తుందని అలా కాకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బాలికలకు ఆత్మస్థైర్యం

తహసీల్దార్ విష్ణుసాగర్



అవగాహన కల్పిస్తున్న అధికారులు తదితరులు

జోగిపేట(అందోల్): బాలికలకు విద్యతోనే ఆత్మస్థైర్యంగా జీవించగలరని తహసీల్దార్ విష్ణుసాగర్ అన్నారు. మంగళవారం ఆందోల్ రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలకు విద్య తప్పనిసరి అన్నారు. ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా ప్రభావంతో చెడు అలవాట్లకు దారితీస్తుంది. ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. బాలికలకు చట్టాలు, శిక్షలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, హెల్ప్‌లైన్ నంబర్లు సైబర్ క్రైమ్ వాటి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, జిల్లా మహిళా సాధికారిత కేంద్రం సమన్వయ కర్త పల్లవి, ప్రిన్సిపాల్,సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, చైల్డ్ లైన్‌స్టాఫ్, షీటీం సభ్యులు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర

జోగిపేట(అందోల్): అందోల్- జోగిపేట మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్ చిట్టిబాబు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాష్ట్రంలోని ప్రజలకు, అందోలు నియోజకవర్గం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అందోల్ నియోజకవర్గంలో ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఫొటోలతో క్యాలెండర్‌లో అచ్చువేయించడంపై మంత్రి సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం మంత్రిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, హనుమాన్లు, రఘు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బొంతపల్లి క్షయవ్యాధి వైద్య శిబిరం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామపంచాయతీ పరిధిలో క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మధుకర్ వైద్య సిబ్బందితో కలిసి రోగులకు ఎక్స్రే పరీక్షలు నిర్వహించారు. 122 మందికి పరీక్షలు నిర్వహించగా 13 మందికి క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు వైద్యులకు గుర్తించారు. వారికి తెమడ పరీక్షలను నిర్వహించిన అనంతరం చికిత్స ప్రారంభిస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నారాయణ, వైద్య సిబ్బంది శ్రీనివాస్, దేవేందర్, టీబీజిల్లా కోఆర్డినేటర్ కృష్ణ, టీబీ ఫీల్డ్ ఆఫీసర్ చందు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, మన్నెమ్మ, లావణ్య, యాదమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

◆ యువత బాధ్యతగా మెలగాలి

సంగారెడ్డి క్రైమ్: ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని పట్టణ టౌన్ సీఐ రమేష్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని యువత, తమ లక్ష్యాలను సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పట్టణంలో శాంతి భద్రతల విషయమే పకడ్బందీ చర్యలు చేపట్టేలా ఉన్నత అధికారులతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

◆ ఘనంగా మహాపడిపూజ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల కేంద్రంలో మంగళవారం అయ్యప్పస్వామి మహాపడిపూజ నిర్వహించారు. ఎంబీఆర్ యువసేన తాలుకా అధ్యక్షుడు కిరణ్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో మెట్ల పూజ, అభిషేకం , తీర్థప్రసాదం, తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, మాజీ ఎంపీటీసీ రాజుకుమార్ సిగ్రె, మాజీ సర్పంచ్ బిరదర్ రవీందర్‌రావు, అయ్యప్ప దీక్షదారులు పాల్గొన్నారు.

◆ సంక్షేమ పథకాలతో లబ్ధి

మునిపల్లి(అందోల్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామాల్లోని ప్రతి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తిరెడ్డి కార్యకర్తలను కోరారు. మంగళవారం మండలంలోని కంకోల్‌లోని ఫంక్షన్ హాలులో బీజేపీ మండల కమిటీ ఏర్పాటుకు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి శ్రీనివాస్ కురుమ, ఎలక్షన్ ఇన్‌చార్జి జగదీశ్వర్ పాటిల్, మండల సీనియర్ నాయకులు బస్వరాజ్‌స్వామి, అయ్యప్పస్వామి, రామకృష్ణ, సిద్ధయ్య సేట్‌తో పాటు బూత్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

◆ రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చిట్యాల: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామశివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. చిట్యాల పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కంది మండలం దేగులవాడి గ్రామానికి చెందిన రాథోడ్ సూరజ్‌కుమార్(28), హైదరాబాద్ నుంచి చిట్యాల వైపు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోని టిగ్రిగోల్డ్ పరిశ్రమ వద్దకు కాగానే వెనుక నుంచి వస్తున్న లారీ సూరజ్‌కుమార్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూరజ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.